# 151. హేండిల్

ఓ గొప్ప చిత్రకారుడు చిత్రించిన చిత్ర ప్రదర్శనకి అనేక మంది వచ్చి చూడసాగారు. అన్నిటిలోకి అందరినీ ఆకర్షించిన చిత్రం, దేవుడు ఓ చేతిలో లాంతరు పట్టుకుని, ఇంకో చేత్తో తలుపు తడుతున్న చిత్రం. ఎంతో సహజంగా, ఆకర్షణీయమైన రంగులతో ఉన్న దాన్ని అంతా మెచ్చుకోసాగారు.

మధ్యాహ్నం ఆ ప్రదర్శనకి వచ్చిన ఒకతను ఆ చిత్రాన్ని పరిశీలించి తన పక్కనున్న మిత్రుడితో చెప్పాడు.

"అంతా బావుంది కాని చిత్రకారుడు ఓ పెద్ద పొరబాటు చేసాడు."

"నేను పట్టుకోలేకపోయాను. ఏమిటా పొరబాటు?" అడిగాడు అతని మిత్రుడు.

"తలుపుని చూడు. దానికి హేండిల్‌ని గీయడం మరిచాడు."

వెంటనే అతని వెనకే ఉన్న ఆ చిత్రకారుడు ఆ విమర్శకి జవాబు చెప్పాడు.

"అది పొరబాటు కాదు. ఆ తలుపు మనిషి హృదయం. దాన్ని లోపలనించి మాత్రమే తెరవగలం కాబట్టి హేండిల్ బయటకి ఉండదు."

# 152. ఎవరితో చెప్పుకోవాలి?

శివపార్వతులు ఓ రోజు కైలాసంలో కూర్చుని తమ భక్తుల గురించి మాట్లాడుకుంటున్నారు. అకస్మాత్తుగా శివుడు లేచి బయటకి పరిగెత్తసాగాడు. అంతలోనే శివుడు వెనుతిరిగి పార్వతి దగ్గరకి వచ్చేసాడు.

"ఏమిటి?" అడిగింది పార్వతి.

"కాశీలోని నా భక్తుడు ఇప్పుడే గుడి నించి ఇంటికి తిరిగి వెళ్తూంటే, కొందరు దుండగులు అతన్ని దొంగగా భావించి కొడుతున్నారు. అది తెలిసి అతన్ని రక్షించాలని బయలుదేరాను." చెప్పాడు శివుడు.

"మరి వెనక్కి తిరిగి వచ్చేసారే?" అర్థం కాక అడిగింది పార్వతి.

"అతను తనకి కలిగిన కష్టానికి దారిన వెళ్ళే కొందరితో చెప్పుకుని, వారి సహాయాన్ని కోరాడు. దాంతో అతనికి నా సహాయం అవసరం లేదని వెనక్కి తిరిగి వచ్చేసాను." చెప్పాడు శివుడు.

మన కష్టాలని ఇతరులకి చెప్పే కంటే, ఆర్చేవాడు తీర్చేవాడు అయిన మన ఇష్ట దైవంతో చెప్పుకోవడం మంచిది.

## 153. పులి కన్నా భయంకరం

ఒకసారి కన్ఫ్యూషియస్ తన శిష్యుడితో వెళ్తూ, ఓ సమాధి పక్కన కూర్చుని ఏడుస్తున్న ఓ యువతిని చూసి అడిగాడు.

"దేనికమ్మా ఏడుస్తున్నావు?"

"పులి వల్ల." సమాధానం చెప్పిందా యువతి.

"ఏం పులి?" ప్రశ్నించాడతను మళ్ళీ.

"కొండల్లోంచి కిందకి వచ్చే పులి గురించి. అది మూడు వారాల క్రితం నా భర్తని చంపి తిన్నది. రెండు వారాల క్రితం నా కొడుకుని చంపి తిన్నది. వారం క్రితం నా మనవడ్ని చంపి తిన్నది. ఇందరిని పోగొట్టుకున్న నాకు దుఃఖం ఆగడం లేదు. పైగా అది రేపు నన్ను కూడా చంపి తినచ్చు."

"అలాంటప్పుడు నువ్వు ఈ ప్రమాదకర ప్రదేశాన్నించి ఎందుకు వెళ్ళడం లేదు?" ప్రశ్నించాడు అతను.

"కాని ఇక్కడ దైవాన్ని ప్రార్థించకూడదన్న నియమం లేదు." చెప్పిందామె.

వెంటనే కన్ఫ్యూషియస్ తన శిష్యుడి వైపు తిరిగి చెప్పాడు.

"దైవ ప్రార్థనా స్వతంత్రం కోల్పోవడం ఆకలి గొన్న పులికన్నా భయంకరమైంది."